క్లుప్తంగా

అభయాంజనేయస్వామి వార్షికోత్సవానికి ఏర్పాట్లు


అభయాంజనేయ స్వామి

ఎస్.రాయవరం: అడ్డురోడ్డులో మంగళవారం అభయాంజనేయ స్వామి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించేందుకు ఉత్సవ కమిటీ భారీ ఏర్పాట్లు చేశారు. జంక్షన్‌లో నాలుగు రోడ్లు వైపు భారీ విద్యుత్ సెట్టింగ్‌లు ఆకర్షణీయంగా అమర్చారు. ఉదయం స్వామికి సింధూర తమలపాకు పూజలతో పాటు, అభిషేకాలకు ఏర్పాట్లు చేశారు. మధ్యాహ్నం అన్న సమారాధన ఏర్పాటు చేస్తున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

పోలిపల్లెమ్మ అమ్మవారి పండగ నేడు


పోలిపల్లెమ్మ అమ్మవారు

మునగపాక : గవర్ల అనకాపల్లిలో మంగళవారం పోలిపల్లెమ్మ అమ్మవారి పండగను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. ఏటా మార్చి మొదటి వారంలో నిర్వహించే ఉత్సవంలో భాగంగా అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేస్తున్నారు. అదే రోజు రాత్రి పలు సాంస్కృతిక ప్రదర్శనలు నిర్వహిస్తున్నామన్నారు. భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి అమ్మవారిని దర్శించుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించాలని నిర్వాహకులు కోరారు.

జూనియర్ కళాశాల వార్షికోత్సవం నేడు

కోటవురట్ల: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల వార్షికోత్సవాన్ని మంగళవారం నిర్వహించనున్నట్టు ప్రిన్సిపాల్ కొండబాబు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి వేడుకలు ప్రారంభమవుతాయని, ఇందులో భాగంగా విద్యార్థులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు ఆయన తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొనాలని కోరారు.

పశువుల పాక దగ్ధం


కాలిపోయిన పశువుల పాక

రాంబిల్లి : దిమిలిలో పశువుల పాక దగ్ధమైంది. కుక్కులూరి అబద్దంకు చెందిన పశువుల పాక కాలి బూడిదైంది. అక్కడున్న చెత్తకు నిప్పు పెట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఈ పాకలో ఇంటి నిర్మాణం కోసం వుంచిన చెక్క ద్వారబంధాలు కూడా కాలిబూడిదయ్యాయని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ బంగారు చిలుకు, వీఆర్వో సత్యనారాయణ, వీఆర్వో అప్పారావు పరిశీలించారు.

ఘనంగా పరదేశిమాంబ విగ్రహ ప్రతిష్ట


పరదేశిమాంబ అమ్మవారిని దర్శించుకుంటున్న ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ ప్రసాద్

మునగపాక : రామారాయుడుపేటలో సోమవారం పరదేశిమాంబ అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. ఉదయం నుంచి ఆలయ ప్రాంగణంలో హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి దర్శనానికి వచ్చే భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు ఏర్పాట్లు చేశారు. ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్, సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి నాగప్పారావు, ఎంపీటీసీ వీరునాయుడు అమ్మవారిని దర్శించుకొన్నారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో అన్న సమారాధన జరిపారు.

హిందూ ధర్మ పరిరక్షణకు పాటుపడాలి


ప్రచార కరపత్రాలను అందిస్తున్న ప్రసాద్

మునగపాక : హిందూ ధర్మపరిరక్షణ ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఏపీ గవర కార్పొరేషన్ చైర్మన్ బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. సమరసతాసేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో సోమవారం మునగపాకలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి ఒక్కరూ దైవచింతన అలవర్చుకోవాలని కోరారు.

ఆదమరిస్తే...అంతేమరి!

- మృత్యు కుహరాలుగా నేల బావులు, నదులు, చెరువులు
- రక్షణ చర్యలు తీసుకోవాలని కోరుతున్న స్థానికులు


వరాహనదిలో ప్రమాదకర ప్రాంతం

కోటవురట్ల : నదుల్లోని ఊబులు, నేల బావులు మృత్యు కుహరాలుగా మారి ప్రాణాలను మింగేస్తున్నాయి. ఆదమరుపుగా వెళ్లే వారు ఏటా పలువురు మృత్యువాత పడుతున్నారు. మండలంలో ఇటువంటి ప్రదేశాలు ఎన్నో ఉన్నా తగిన రక్షణ చర్యలు కరువయ్యాయి. రామచంద్రపురం శివారు వరాహనదిలో ఉన్న సమగ్ర రక్షిత మంచినీటి పథకం వద్ద, యండపల్లి శివారున, రాజుపేట వెళ్లే దారిలో ప్రమాదకరంగా ఉన్న నేలబావి, చెరువుల్లోను ఈ మృత్యు కుహరాలు ఉన్నాయి. ప్రతి సంవత్సరం ఎన్నో ప్రాణాలు హరిస్తున్నాయి. ఆయా గ్రామాలలోని ప్రజా ప్రతినిధులైనా సమస్య పరిష్కారానికి చొరవ చూపాలని పలువురు బాధితులు కోరుతున్నారు.

ప్రమాదాలు ఇలా...

రామచంద్రపురం శివారు వరాహనదిలో సమగ్ర రక్షిత మంచినీటి పథకం సమీపంలో గతంలో ఇద్దరు వ్యక్తులు ఊబిలో ఇరుక్కుని మృతి చెందారు. గవరపేట సమీపంలో వరాహనదిలోని ఊబిలో గతంలో ఓ రైతు మునిగిపోయి మృతి చెందాడు. యండపల్లి శివారు వరాహనదిలో వంతెన సమీపంలో పెద్ద అఖాతం ఏర్పడింది. ఓ తాటిచెట్టు నిలువున లోతు ఉండడంతో ఎరగక స్నానానికి దిగిన వారు మృత్యువాత పడుతున్నారు. గతంలో ఒకరు మునిగిపోగా ఇటీవలే ఓ బాలుడు దిగి మునిగిపోయి చనిపోయాడు. ఇటువంటి చోట్ల ఇలా ఎన్ని సంఘటనలు జరిగినా తగు రక్షణ చర్యలు మాత్రం తీసుకోలేదు.

హెచ్చరిక బోర్డులు కూడా లేవు..

వేసవి సెలవులు వస్తే విద్యార్థులు నదుల్లో స్నానాలకు పరుగులు తీస్తుంటారు. తల్లిదండ్రులు ఏమాత్రం ఆదమరిచి పిల్లలను విడిచిపెట్టినా నదుల్లో స్నానాలకు వెళ్లి మృత్యువాత పడే ప్రమాదం ఉంది. అధికారులు స్పందించి ప్రమాదకరంగా ఉన్న ప్రాంతాలల్లో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి నదుల్లోకి దిగకుండా కఠిన చర్యలు తీసుకోవలసి ఉంది. అధికారులు స్పందిస్తే తల్లిదండ్రుల కడుపుకోతను నివారించవచ్చని పలువురు సూచిస్తున్నారు.

ముమ్మరంగా ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం


వెల్చూరులో సుధాకర్ గెలుపు కోసం ప్రచారం నిర్వహిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


పెంటకోట హైస్కూల్‌లో ప్రచారం నిర్వహిస్తున్న చిక్కాల రామారావు


పాయకరావుపేటలో ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు


ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ విజయం కోరుతూ ప్రచారం చేస్తున్న ఎంపీపీ జయలక్ష్మి

రాంబిల్లి : ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్‌ను గెలిపించాలని మండలంలో వాడనర్సాపురం, కొత్తపట్నం, గోవిందపాలెం, కొత్తపేట, వెల్చూరు, రాజుకోడూరు తదితర గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జగనన్న సంక్షేమ పాలనను చూసి సుధాకర్‌ను గెలిపించాలని ఎంపీపీ జి.శిరీషశ్రీనుబాబు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పిన్నంరాజు కిషోర్, మండల సచివాలయ కన్వీనర్ కొవిరి రామకృష్ణ కోరారు.

పాయకరావుపేటలో...

పాయకరావుపేట : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు వైఎస్సార్‌సీపీ నాయకులు ముమ్మరంగా ప్రచారం నిర్వహిస్తున్నారు. పెంటకోట గ్రామంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్, విశాఖ ఉత్తర నియోజకవర్గ ఎన్నికల పరిశీలకుడు చిక్కాల రామారావు ప్రచారం నిర్వహించారు. పెంటకోట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల్లో ఉపాధ్యాయులను కలిసి వైఎస్సార్‌సీపీ మద్దతుతో ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యతా ఓటును వేయాలని కోరారు. జెడ్పీటీసీ లంక సూర్యానారాయణ, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ధనిశెట్టి బాబూరావు, పార్టీ పబ్లిక్ విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, ఏఎంసీ వైస్‌చైర్మన్ గూటూరు శ్రీనివాసరావు పట్టభద్రులను కలిసి సీతంరాజు సుధాకర్‌కు ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పాయకరావుపేట సర్పంచ్, ఉపసర్పంచ్‌లు ఉషశ్రీ ప్రసాద్, జగతా భవానీ శ్రీనివాస్, వైస్ ఎంపీపీ ధనిశెట్టి మాధవి తిరుమలేశ్వరరావు, నాగరాజు పాల్గొన్నారు.

మునగపాకలో...

మునగపాక : ఉత్తరాంధ్ర అభివృద్ధి సీఎం జగన్‌మోహన్‌రెడ్డితోనే సాధ్యమవుతుందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి అన్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ మద్దతు అభ్యర్థి సీతంరాజు సుధాకర్ విజయం కోరుతూ మునగపాకలో సోమవారం ప్రచారం నిర్వహించారు. ఈ ప్రాంతం అభివృద్ధి సాధించాలంటే సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాల్సిన అవసరం ఉందన్నారు. పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి రామ్మోహనరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కనకలక్ష్మి అప్పారావు, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, మునగపాక సచివాలయ కన్వీనర్ బొడ్డేడ మహేష్, పార్టీ అధికార ప్రతినిధి ఆడారి కాశిబాబు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా సుధాకర్‌ను గెలిపించండి


గురుకుల పాఠశాలలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు


యలమంచిలిలో సీతంరాజు సుధాకర్ తరఫున ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న ఎంపీపీ గోవింద్


కె.వెంకటాపురంలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు రమేష్

నక్కపల్లి : ఈనెల 13వ తేదీన జరిగే ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు కోరారు. సోమవారం ఆయన నక్కపల్లిలో ప్రభుత్వ బాలుర, బాలికల పాఠశాలలు, గురుకుల కళాశాలలో ఉపాధ్యాయులను కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. నమూనా బ్యాలెట్‌ను చూపించి సుధాకర్ సీరియల్ నెంబరు 3లో మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలన్నారు. తద్వారా స్థానిక సమస్యలను శాసన మండలిలో ప్రస్తావించి పరిష్కరించే అవకాశం లభిస్తుందన్నారు. విద్యావంతుడు సమస్యల పట్ల అవగాహన కలిగిన వ్యక్తి సుధాకర్ అని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, లొడగల చంద్రరావు, బచ్చలరాజు పీఏసీఎస్ అధ్యక్షుడు తాత బాబు, సింహాచలం దేవస్థానం మెంబరు శేషారత్నం, స్థానిక నాయకులు నర్సింహమూర్తి గోవింద, కొర్లయ్య, శ్రీను, ఈశ్వరరావు, బాబ్జి పాల్గొన్నారు.

యలమంచిలి : ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ తరఫున యలమంచిలి పట్టణంలోని ఎంపీపీ బోదెపు గోవింద్ ఆధ్వర్యంలో సోమవారం పట్టభద్రులను కలసి మద్దతును తెలపాలని కోరారు. యలమంచిలి పట్టణం, మండలంలోని పట్టభద్రులంతా విద్యావంతుడైన సుధాకర్ విజయానికి కృషి చేయాలని కోరారు. యువతీ యువకులకు అధిక శాతం సచివాలయ, విద్య, వైద్య, వ్యసాయ రంగాల్లో అనేక శాఖల్లో ఉద్యోగాలు కల్పించిన ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి పట్టభద్రులంతా మద్దతు తెలపాలని అభ్యర్థించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ బొద్దపు యర్రయ్యదొర, కౌన్సిలర్లు గొర్లె వెంకట్, దూది నరసింహమూర్తి, మోహన్ పాల్గొన్నారు.

కోటవురట్ల: వైఎస్సార్ సీపీ బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి అత్యధిక మెజార్టీతో గెలిపించాలని వైఎస్సార్ సీపీ జిల్లా బీసీ సెల్ అధ్యక్షుడు పైల రమేష్ కోరారు. కె.వెంకటాపురంలో ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్ తరఫున సోమవారం రాత్రి ఎన్నికల ప్రచారం చేశారు. నమూనా బ్యాలెట్ చూపించి సీతంరాజు సుధాకర్‌కు ఎదురుగా ఒకటి వేయాలని సూచించారు.

ఎమ్మెల్సీ ఎన్నిక ప్రతిష్టాత్మకం


నమూనా బ్యాలెట్ పేపర్ చూపిస్తున్న నాయకులు

ఎస్.రాయవరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించి ఉత్తరాంధ్ర సత్తా చాటాలని పాయకరావుపేట నియోజకవర్గ పరిశీలకుడు చింతలపూడి వెంకటరామయ్య అన్నారు. అడ్డురోడ్డులో మండల సర్పంచ్‌లు, ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. మార్చి 13 న జరగబోయే ఎన్నికల్లో గ్రాడ్యుయేట్లతో పూర్తి స్థాయిలో ఓట్లు వేయించే బాధ్యత ప్రతి ఒక్కరూ తీసుకోవాలన్నారు. విశాఖపట్నంలో సీఎం సమక్షంలో జరిగిన గ్లోబల్ సమ్మిట్‌తో రాష్ట్రంలో ప్రతిపక్షాలకు వణుకుపుట్టిందన్నారు. సీఎం దృష్టి అంతా విశాఖ అభివృద్ధి వైపే ఉందని, త్వరలో పరిపాలన రాజధానిగా విశాఖ మారనున్న తరుణంలో ఈ ఎన్నిక పార్టీకి ప్రతిష్టాత్మకం అని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే చెంగల వెంకట్రావు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ, ఎంపీపీ కోన లోవలక్ష్మి, జెడ్పీటీసీ కాకార దేవి, వైఎస్సార్‌సీపీ మండల పార్టీ అధ్యక్షుడు కొణతాల శ్రీనివాసరావు, మండల సర్పంచ్‌ల సంఘ అధ్యక్షుడు కర్రి సత్యనారాయణ, సర్పంచ్‌లు ధూళి శ్రీనుబాబు, శానాపతి శ్రీరాములు, పాలపర్తి పాపారావు, ఎంపీటీసీలు బైపా శ్రీనివాసరావు, బాలం సూరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు వెదుళ్ల బంగారి, అద్దేపల్లి బొజ్జన్న, గరగా శ్రీను, కోరెడ్డి సుబ్బారావు, వెలగా శ్రీనివాసరావు, చోడిపల్లి కోదండం, నల్లపరాజు వెంకట్రాజు, కాశెపు అప్పన్న పాల్గొన్నారు.

కులవృత్తులకు ప్రాణం పోసిన ఘనత జగనన్నదే

రజకులు ఆధ్వర్యంలో క్షీరాభిషేకం


యలమంచిలిలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రజకులు

యలమంచిలి : రాష్ట్రంలో కులవృత్తులకు ప్రాణం పోసిన ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి అని రజకులు అన్నారు. యలమంచిలి పట్టణంలో సోమవారం సాయంత్రం రజకులు ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. రాష్ట్రంలో గత ప్రభుత్వాలు కులవృత్తిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న రజలకుల నుంచి అధిక మొత్తంలో సొమ్ములు వసూలు చేసి సబ్సిడీపై నాసిరకమైన పనిముట్లు అందజేసేవారని, వాటిలో తెలుగుదేశం నాయకులు అవినీతికి పాల్పడేవారని వారికి అనువైన వ్యక్తులకు కొంత మందికే పథకాలు అందేవని అన్నారు. ప్రస్తుతం జగనన్న ప్రభుత్వంలో చేదోడు పథకం ద్వారా రజకులకు ఆర్థికంగా ఆదుకుంటున్నారని కొనియాడారు. రజకులు పడుతున్న ఇబ్బందులను కష్టాలను స్వయంగా ప్రజాసంకల్ప యాత్రలో నేరుగా చూసిన జగనన్న నవరత్నాల్లో భాగంగా చేదోడు పథకం ద్వారా రజకుల కుటుంబాలకు పెద్ద దిక్కుగా నిలిచారని అన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి ఇంతటి సంక్షేమ పథకాలను కులవృత్తుల వారీగా అందించలేదని, జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో పేదలకు న్యాయం జరుగుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ బోదెపు గోవింద్, మున్సిపల్ వైస్ చైర్మన్‌లు, బెజవాడ నాగేశ్వరావు, అర్రెపు గుప్త, మాజీ జెడ్పీటీసీ బొద్దపు యర్రయ్యదొర రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.

పెంటకోటలో సైకిల్ థాన్ ప్రారంభం


సైకిల్ తొక్కుతున్న రామారావు, డాక్టర్ మురళీకృష్ణారెడ్డి

పాయకరావుపేట : మహిళా దినోత్సవం సందర్భంగా పెంటకోట గ్రామంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, సైకిల్ థాన్ కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులు సైకిల్ తొక్కాడం ఆరోగ్యానికి ఎంతో మంచిదని కార్యక్రమానికి హాజరైన మంగవరం పీహెచ్‌సీ వైద్యాధికారి మురళీకృష్ణారెడ్డి అన్నారు. విద్యార్థులకు వ్యాయా మం ఎంతో అవసరం అన్నారు. అనంతరం చిక్కాల రామారావు, డాక్టర్ మురళీ కృష్ణారెడ్డి సైకిల్ తొక్కారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ జి.చిన అప్పలరాజు, జెడ్పీహెచ్ స్కూల్ ఉపాధ్యాయులు, పీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

‘ఫ్యామిలీ డాక్టర్’తో ఇంటింటికీ ఆరోగ్య సేవలు


తిమ్మరాజుపేటలో ఫ్యామిలీ ఫిజిషియన్ సేవలు పరిశీలిస్తున్న సర్పంచ్ మంగలక్ష్మి

మునగపాక : ప్రతి ఒక్కరూ ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని సద్వినియోగం చేసుకోవాలని తిమ్మరాజుపేట సర్పంచ్ భీమిశెట్టి మంగలక్ష్మి కోరారు. సోమవారం తిమ్మరాజుపేటలో ఏర్పాటు చేసిన ఫ్యామిలీ డాక్టర్ విధానాన్ని ఆమె పరిశీలించారు. సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన ఫ్యామిలీ డాక్టర్ విధానం ప్రజలకు మేలు చేస్తుందన్నారు. ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సమస్యలు అడిగి తెలుసుకోవడంతో పాటు వారికి భరోసా ఇస్తున్నారన్నారు. ఉప సర్పంచ్ కాండ్రేగుల జగన్, ఎంపీటీసీ శరగడం అప్పలనరసమ్మ కార్యక్రమంలో పాల్గొన్నారు. కాగా వైద్యాధికారి ఎస్తేర్‌రాణి వైద్య సేవలందించారు.

మత్తు జోలికి పోవద్దు

- విద్యార్థులకు సెబ్ ఎస్ఐ గణేష్ సూచనలు
- నార్కోటిక్ చట్టంపై అవగాహన


విద్యార్థులకు డ్రగ్స్ దుష్ప్రభావాలు గురించి వివరిస్తున్న సెబ్ ఎస్ఐ గణేష్

యలమంచిలి : ప్రాణాంతక డ్రగ్స్, గంజాయి, మాదక ద్రవ్యాల జోలికి పోకుండా విద్యార్థులు సన్మార్గంలో నడవాలని స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో (సెబ్) ఎస్ఐ కె.ఎస్ గణేష్ అన్నారు. సోమవారం యలమంచిలి స్టేషన్ రోడ్డులో గీతాంజలి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు డ్రగ్స్, గంజాయి, హషిష్, కొకైన్, హెరాయిన్ వంటి మత్తు పదార్థాల గురించి వివరించి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ దిశగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా కృషి చేస్తోందని, సమాజంలో యువతా మేలుకో-భవితను మలుచుకో -డ్రగ్స్‌ను వదులుకో అనే నినాదంతో మత్తు పదార్థాలకు యువత దూరంగా ఉండాలని, కళాశాలల్లో యువతీ,యువకులకు ఉద్బోధించడం జరుగుతోందని అన్నారు. గంజాయి, మత్తు పదార్థాలు వినియోగించినా, కలిగి ఉన్నా, విక్రయించినా, అటువంటి కార్యకలాపాలకు ప్రోత్సహించినా నార్కోటిక్స్ చట్టం ప్రకారం 6 నెలల నుంచి 20 సంవత్సరాలు వరకు కఠిన జైలు శిక్షలు ఉంటాయని హెచ్చరించారు. ఎవరైనా ఇటువంటి కార్యకలాపాలకు పాల్పడుతున్నట్టు తెలిస్తే 14500 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని, వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని తెలిపారు. డ్రగ్స్‌ను సేవించడం ద్వారా, శారీరక రుగ్మతలు, వ్యాధుల బారిన పడి ప్రాణాలు కోల్పోతున్న వారిలో యుక్తవయసు వారే అధికమని అన్నారు. విద్యార్థులు అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండి ఉన్నత విద్యను అభ్యసించి సన్మార్గంలో నడుచుకోవాలని అన్నారు.

సమర్థులను గెలిపిస్తే మరింత అభివృద్ధి


గుడివాడలో పట్టభద్రుల ఓటర్లకు బ్రోచర్లు, బ్యాలెట్ నమూనా వివరిస్తున్న ఎమ్మెల్యే బాబూరావు

ఎస్.రాయవరం : చదువుకున్న వారందరూ సమర్థులకు సహకారం అందిస్తే అభివృద్ధి మరింత సులభతరం అవుతుందని పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అన్నారు. గుడివాడ గ్రామంలో మంగళవారం గ్రాడ్యుయేట్లతో ఎమ్మెల్యే సమావేశం నిర్వహించి ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన సీతంరాజు సుధాకర్‌కు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని అభ్యర్థించారు. కొత్తపోలవరం గ్రామానికి చెందిన ధూళి రాజు అనే ఐటీఐ విద్యార్థి మాట్లాడుతూ అభివృద్ధి జరగాలంటే సమర్థులకు ఓటు వేసి గెలిపించాలని అన్నారు. నాయకులు శ్రీపతిరాజు, రఘునాథరాజు, అచ్చుతరామరాజు, జోగిబాబు, వర్మరాజు, మామిడి చంటి, నూకు నాయుడు, సర్పంచ్‌లు లోవరాజు, వెంకటరమణ, మత్స్యకార సంఘ జిల్లా అధ్యక్షుడు గురునాథరావు, పీఏసీఎస్ అధ్యక్షుడు నాగరాజు, చేపలరాజు, వీర్రాజు, వాసు పాల్గొన్నారు.

కట్టుబోలులో భూ సర్వే


భూసర్వేపై రైతులతో మాట్లాడుతున్న అధికారులు

రాంబిల్లి : సమగ్ర భూ సర్వేతో రైతులకు ఎంతో మేలు జరుగుతుందని వీఆర్వో రాజాన జగన్నాథరావు అన్నారు. కట్టుబోలులో సోమవారం సమగ్ర భూ సర్వేపై రైతులతో సమావేశం నిర్వహించారు. డ్రోన్ సర్వే ప్రకారం రైతుల భూముల విస్తీర్ణం, రైతుల వద్ద పాసు పుస్తకాలలో నమోదైన వివరాలు సరి చూశారు. విస్తీర్ణం సరిపోయిన రైతుల నుంచి సంతకాల పత్రాలను అధికారులు తీసుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్వో మాట్లాడుతూ, భూ సర్వే పూర్తయిందని, మొత్తం 838 ఎకరాలకు ఇంకా 250 రైతులు రావాల్సి ఉందన్నారు. వీరు కూడా భూ సర్వే ప్రకారం వచ్చిన విస్తీర్ణం సరి చూసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్వేయర్ ప్రసాద్, వీఆర్ఏలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ‘ద్రోణ 23’


ఫెస్ట్‌లో పాల్గొన్న ఎన్‌సీసీ క్యాడెట్లు

అచ్యుతాపురం(అనకాపల్లి): మండలంలోని ప్రశాంతి పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం ‘ద్రోణ 23’ పేరిట నిర్వహించిన ఎన్‌సీసీ ఫెస్ట్‌లో విద్యార్థులు అద్భుతమైన విన్యాసాలు ప్రదర్శించారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ఎలా వ్యవహరించాలి..?, అగ్నిమాపక సిబ్బంది మాక్‌డ్రిల్, సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కమాండింగ్ అధికారి కల్నల్ తాపస్ మండల్ ఈ సందర్భంగా ఎన్‌సీసీ గురించి పలు విషయాలు తెలిపారు. కళాశాల కరస్పాండెంట్ ధర్మిరెడ్డి ప్రసాద్, ఎన్‌సీసీ అధికారులు, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

తమలపాకు తోటల్లో సస్యరక్షణ చర్యలు తీసుకోవాలి


మాట్లాడుతున్న హార్టికల్చర్ అధికారిణి ఉమామహేశ్వరి

పాయకరావుపేట : తమలపాకు పంటలను పండించే రైతులు తప్పనిసరిగా సస్యరక్షణ చర్యలు తీసుకోవాలని మండల ఉద్యానవనశాఖాధికారి సిహెచ్.ఉమామహేశ్వరి అన్నారు. సత్యవరం గ్రామంలో రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. తమలపాకు తోటలకు సోకుతున్న ఆకుకుళ్ళు, మొదలు కుళ్ళు, ఆకుమచ్చ, కాండంగజ్జి తెగులు, నత్తలు, గొంగళి పురుగులు ద్వారా సంక్రమించే తెగుళ్లను ఎదుర్కోవడానికి రైతులు తీసుకోవాలని జాగ్రత్తలు, ఉపయోగించవలసిన పురుగు మందులపై రైతులకు అవగాహన కల్పించారు. ఏఏ తెగుళ్లకు ఏఏ పురుగు మందులు పిచికారీ చేయాలో రైతులకు అవగాహన కల్పించారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన


అలివేలు మంగ పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన పలు సైన్సు నమూనాలు

యలమంచిలి : పట్టణంలో అలవేలు మంగ పాఠశాలలో సోమవారం 1వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులకు సైన్సు ఫేర్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులు తయారు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. శాస్త్ర సాంకేతిక నమూనాలను వివిధ ఆకృతుల్లో నిర్మించి సృజనాత్మకతను చూపారు. వీటిపై తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులకు తమ ప్రయోగాలు గురించి వివరించారు. ఈ సైన్స్‌ఫేర్‌లో విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నక్కపల్లి ఆస్పత్రిలో త్వరలో ట్రామాకేర్ సెంటర్


ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న సేవలను తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

నక్కపల్లి : నక్కపల్లి ఏరియా ఆస్పత్రిలో త్వరలో ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయనున్నట్టు ఎమ్మెల్యే గొల్ల బాబూరావు తెలిపారు. సోమవారం ఆయన ఆస్పత్రిని సందర్శించి రోగులకు అందుతున్న సేవలను పరిశీలించారు. ఇన్‌పేషంట్లుగా ఉన్న రోగులకు నాణ్యమైన భోజనం అందించాలన్నారు. అత్యవసర వైద్యం కోసం, రోడ్డు ప్రమాదాల బారిన పడిన వారిని ఆస్పత్రికి తీసుకువస్తే పెద్దాస్పత్రులకు రిఫర్ చేస్తున్నారని, సకాలంలో వైద్యం అందక చాలా మంది మృత్యువాత పడుతున్నారన్నారు. దీన్ని నివారించేందుకు ట్రామాకేర్ సెంటర్ ఏర్పాటు చేయాలని సీఎంను కోరడం జరిగిందన్నారు. త్వరలోనే మంజూరవుతుందన్నారు. కార్యక్రమంలో ఆయన వెంట నాయకులు లొడగల చంద్రరావు, శీరం నర్సింహమూర్తి, శేషారత్నం, సూరాకాసుల గోవిందు, తాతబాబు, బాబ్జి ఉన్నారు.

ప్రకటన

[illegible]

షెడ్యూలు:

[illegible]

నలుగు కృష్ణశేఖర్, అడ్వకేట్

[illegible]